స్కెచ్

# సావిత్రి స్వగతం

కె. రామలక్ష్మి

ప్రశాంతంగా మానవ సంచారమే లేని మిట్ట మధ్యాహ్నం వేళప్పుడు, గాలికి కదలాడే నీడలను దాటుకుంటూ, ఎవరికంటా పడకుండా మా పెద్ద భవనపు పెరటి పక్కకి చేరుకోవాలి. అక్కడే విశాలమైన నూతి చప్టామీద కూర్చుని సూర్యుడు కృంగేదాకా, నీడలు సాగిసాగి పొద్దు గయ్యే దాకా గడచిన ఘట్టాలని నెమరువేసుకుంటూ కూర్చోవాలి. తరవాత? తరవాత యేం జరుగుతుందో తల్చుకుంటే నవ్వొస్తూంది. భయమేస్తూంది. అదేమిటో సాయింత్రంవేళ అనవసరంగా అన్ని పక్షులూ అంత గొడవచేస్తాయి! యిళ్ళకి వెళ్ళే హడావిడిలోనా? యింటికి వెళ్ళేటందుకు అసహ్యంచేతనా? ఈపెద్ద గందరగోళం యీ పక్షిలోకంలో? చిన్నపిల్లల్లా-యిట్లోకి పోయేముందు అమ్మ అదిలించి పక్కలోకి చేర్చేసేముందు యింకొక్క ఆట ఆడాలన్నట్లు—ఏమిటో పెద్ద గందరగోళం! సూర్యుడు పూర్తిగా అస్తమించేయడంతో అంతా మళ్ళీ నిశ్శబ్దం. ఇంట్లోకి వెళ్ళాలి... ఎప్పుడూ ఇంతే-యీ నూతి చప్టామీద ప్రశాంతంగా కూర్చోవచ్చు. కాని ఏకాంతంగా మటుకు వుండలేను. జ్ఞాపకాల సహచర్యం ఎప్పుడూ వుంటుంది. కాని యింట్లోకి వెళ్ళాలి. ఆయనకి మందు యిచ్చే టైమయింది. ఈ పల్లెపట్టులో యెంతో అందంగా ప్రశాంతంగా వుండే స్థలాలనేకం వున్నాయి. కాని మా పెరట్లోని ఈ నూతి చప్టా, పక్కనే బాదంచెట్టూ ఉన్నంత బాగా నాకింకేదీ బాగుండదు.

కొంచం ఎత్తుగా వుండి నూతిచప్టా బాగుంటుంది. ఆయన చెప్పినట్లు అక్కడ కూర్చుంటే ఆలోచనలు కట్లుతెగి ప్రవహిస్తాయి. హృదయాంతరాళాలలోంచి కవిత్వం పుట్టుకొస్తుంది. సర్వప్రపంచంమీదా, ఆదరణా ప్రేమా అభిమానం పుట్టుకొస్తాయి. ఆయన అన్నట్లు కాకపోయినా నాకు యిదో కోరుకోతగ్గ స్థలంగానే తోస్తుంది. ఈ పల్లెపట్టు వదలి పధ్నాలుగు సంవత్సరాలపాటు పెద్ద పట్టణాలూ, వింత వినోదాలు తిలకించి, అనుభవించి వచ్చిన నాకు యిదో కోరుకో తగ్గస్థలంగానే అనిపిస్తుంది. అందుకే క్షణం అవకాశం చిక్కినా యీ నూతి చప్టామీద, బాదంచెట్టులో పండిన ఆకులని లెక్కపెట్టడానికి ప్రయత్నిస్తూ కూర్చుంటాను.

ఆయన మంచివాడు ఆదర్శాలతో ఆకాశాన్ని అందుకోవాలని అనుకోడం బాగానే వుంటుంది. కాని దానికీ ఓ ప్రత్యేకత, యిదీ నా పద్ధతి అని చెప్పుకొనే ధీమా లేకుంటే బాధ. ఏదో సృష్టిద్దాం అన్న కోరికా, ఆకోరికను ఫలింప చేసుకొందుకు అశక్తతా—మరీ బాధాకరం. ఆయన సుగుణాలరాసి. కాని అన్ని సుగుణాలు ఎలాగ భరించడం? ఆయన—తాగడు. ఆడవాళ్ళంటే అభిమానించడు, పేచీలు తెచ్చుకోడు—మోసగించలేదు, అవిశ్వాసం ప్రకటించలేదు, మోటగా ప్రవర్తించలేదు, యిది నాదీ అని స్వార్థానికి కోరుకోలేదు. ఏదీ చెయ్యలేదు. నాకు పదిహేడేళ్ళప్పుడు నాన్న యీయన్ని నాకోసం చూశాడు. ఆనాడు యీ సుగుణాలన్నీ నాకెంతో అభిమాన పాత్రం అయాయి. వాటినిచూసి నేనెంతో గౌరవించాను. ప్రేమించాను. కొన్ని సంవత్సరాలపాటు వాటన్నటినీ ప్రేమించాను కాని తరవాత తరవాత తోచేది నేనెందుకీ పెళ్ళికిట్టే ఒప్పేసుకున్నానా అని! కాని కారణాలు యిట్టే దొరికాయి: నాన్న హయాం తప్పిపోతే చాలనిపించింది ఆ రోజులలో. ఆ వయస్సులో ఏమైనా చెయ్యవచ్చుకాని ఒకరు చెప్పిన మాట వినడం అన్నది కష్టతరంగా తోచేది. అందుకే పెళ్ళికి ఒప్పేసుకున్నాను. ఆయనతో వెళ్ళంటే హాయిగా గాలిలా బలికేయడం. అది తెలిసే ఒప్పేసుకున్నాను.ఆయనతోపాటు మాయీ పెరట్లో ఎన్నెన్ని ప్రశాంత సాయంత్రాలు గడిపానో...పక్కనించి పోయే మేకలూ పిల్లలూ,

మా పెంపుడు కుక్కా దాని అరడజను పిల్లలూ, ఎక్కడ చూసినా ప్రకృతి నిండుగావుండి నన్ను బాధపెట్టేది. నాకెందుకు లేదు యీ నిండుతనం? నాకెందుకురాదు మాతృస్థానం? అని కనబడని దేవుళ్ళని అడుగుతూ,ఏకాంతంలో వాపోయేదాన్ని.

కాని అదంతా యిప్పుడు తలుచుకుంటే నవ్వొస్తుంది: నన్నుచూసీ ఆయనని చూసీ కూడా. కాకుంటే ఏమిటి? నన్ను నేనే ఒక్కసారి చూసుకుంటే! నే అందించే రూపు చూస్తే! నలభయో పడిలోపడ్డాను. ఎటొచ్చీ చిన్నతనంనుంచీ దృఢమైన శరీరం అవడంచేతా, చక్కటి పోషణవల్లా కాని,నలభైఏళ్ళొచ్చేసరికి ఇంకేముంది ఆడదానిలో?

యిలా కూర్చున్నప్పుడు నన్ను నేనే ప్రశ్నించుకుంటూ వుంటాను: నేను ముసలిదాన్ని అయిపోయాను అంటే ఏమిటి? ముసలి ఆడదంటే ఏమిటి? నేనెవరు? ముసలిదాన్నే కాని పాతదాన్నే: నాలో యిమిడిపోయి చిన్నతనపు నేను, ఐశ్వర్యవంతుని కూతురుగా ఐశ్వర్యపు టొడిలో పెరిగి పెద్దదాన్నయిన నేను, పతికి అన్ని సేవలూ చేసే ఆదర్శవంతమైన భార్యగా నేను అంతేకాదు,పతితనయిపోయిన నేను, వినోదంకోసం, అసంతృప్తిచే నిద్రించని కోర్కెల సఫలతకోసం లేచిపోయిన, (ఎవరితో, ఎందుకూ పనికించిరాని వాడితో, రౌడీతో లేచిపోయిన) పతితనైన నేను, దారుణంగా సాంప్రదాయపు కట్లు తెంచుకొన్న నేను, యిప్పుడు పశ్చాత్తాపంతో, దహించుకుపోయే హృదయం నూతి చప్టాను ప్రేమించే నేనూ- అన్నీ నాలో యిమిడిపోయే వున్నాయి. అసలు వృధాప్యం క్షణంలో వస్తుందా, నా పిచ్చిగాని! ఎన్నెని జీవనరంగాలు దాటేక, వాటివాటి ఫలితాలు యీ శరీరంలో గుర్తింపబడ్డాక, ఎన్నాళ్ళకి ,ఎన్నాళ్ళ కూడికగానో వస్తుంది వృద్ధాప్యం యిన్నాళ్ళ తరవాతకూడా వెంకటేశ్వర్లతో దేశాలూ తిరుగుతూ గడిపిన దినాలూ, అసలీపల్లెనే పూర్తిగా మరిచి, యీ యింటినీ యీాయన్నీ కూడ మరిచి గడిపిన దినాలూ; జ్ఞాపకాలుగా వెన్నంటి వుంటూనే వున్నాయి. నలభయో పడిలోపడ్డ నేను కష్టా రామా అనుకోకుండా జ్ఞాపకాల బాధనుండి తప్పించుకునే తాపత్రయంలో మునిగిపోయాను...అవును వెంకటేశ్వర్లుని ఓ పట్టాన మరిచిపోవడం. ఎలాగ? నాలో కోర్కెలను రేపి నా జీవితంలో సునాయాసంగా పధ్నాల్గు సంవత్సరాలని దాచుకో కల్గిన వెంకటేశ్వర్లుని మరిచిపోవడం ఎలాగ?...

అంతగా నన్ను ప్రేమించి లాలించిన వెంకటేశానికే ఎంతటి దైవభక్తీ, నీతివంతులంటే పూజ్యభావమూ వుండేవి! ఎంతో సంతోషంతో సర్వం మరచి, విశాలమైన అతని గుండెలమీద తలవాల్చి పడుకునివున్న సందర్భంలో— "చూడు సావిత్రీ నిన్ను లేవతీసుకొచ్చినందుకు నన్ను దేవుడు క్షమించడు; అందరూ నిన్ను పతిత అంటారు. అప్పుడు నీకెలా వుంటుంది?"అని అడిగేవాడు. అప్పుడు అనిపించేది—లోకం ఏమనుకుంటే నాకేం, వెంకటేశ్వర్లు నావాడు,వెంకటేశ్వరులచేతుల్లో జీవితం వెళ్ళిపోతే చాలు అని. కాని అన్నీ మనం అనుకున్నట్లే జరుగుతాయా?..పధ్నాలుగేళ్లు, ఎవరూ ఏ అగ్నిసాక్షిగా వివాహంచేసుకొన్న భార్యనూ ఆదరించని రీతిగా, అభిమానించని రీతిగా నన్ను ఆదరించాడు, అభిమానించాడు. భార్యమీద వుండే అధికారం ప్రియురాలి కనుసన్నలలో మెలగవలసిన అవసరం, రెండూ నాలో లభించాయి వెంకటేశానికి. అందుకే పధ్నాలుగేళ్లు నిముషాల్లా క్షణాల్లా గడిచిపోయాయి. చెట్టంత వెంకటేశం హఠాత్తుగా చనిపోయాడు. అతనితోపాటే నా కోరికలూ చనిపోయాయి. జీవితం యింక ఎలా గడిస్తే నేం? ఎక్కడ గడిస్తే నేం? అనిపించేది. కాని ఎక్కడ గడపాలి అన్న ప్రశ్న తీవ్రంగా ఎదుర్కొన్నప్పుడుమాత్రమే నేను వధువుగా అడుగిడిన పల్లెలోని యీ పెద్ద భవంతి జ్ఞాపకంవచ్చింది. ఆయనజ్ఞాపకం వచ్చారు. ఆయనలో ఆనాడు నన్ను విసిగించిన సద్గుణాలన్నీ జ్ఞాపకం వచ్చాయి.

...దూరదేశం వదలి యీవూరు స్టేషనులో రైలుదిగినప్పుడూ, బండి బేరమాడి ఎక్కినప్పుడూ కూడా తోచని ఆశ్చర్యం యింటిముందు బండి ఆగగానే నన్ను ఆవహించింది అప్పటి పిరికితనం తల్చుకుంటే నవ్వొస్తుంది యిప్పటికీ. తలుపు తడితే— సమాధానం లేకుండానే తలుపు తెరుచుకుంది. ఆయనే తీశారు,తలుపు. కొద్దిక్షణాలు గుర్తుపట్టలేదు నన్ను. అదే పెద్దలోటన్నట్లు "క్షమించునన్ను సావిత్రీ! యిప్పట్లో నువ్వొస్తావని అనుకోలేదు" అన్నారు. కట్టలు తెగిప్రవహించాయి నా కళ్ళనీళ్లు. ఆ యింట్లో

నన్ను యింకో ప్రశ్న ఎవరూ వేయలేదు. ఎవరున్నారని వేయడానికి?

ఆయనే ఓరోజు నాచేయి నిమురుతూ అన్నారు 'యిక్కడికి తిరిగి రావలసి వచ్చినందుకు బాధ పడవుకదూ—సావిత్రీ' అని.

''లేదు ఎప్పటికీ బాధపడను. ఇలా ఎప్పుడో నేను రావలిసిందే.'' అన్నాను. ''అదే మంచిది. నాకెంతో సంతోషంగా వుంది'' అంటూ ఆయన వెళ్ళిపోయారు. అంతే. కాలం మళ్ళా మామూలుగా గడిచిపోతూంది. యీ యింటిని పాతికేళ్ళ యౌవనిగా వదిలిపెట్టి పోయాను. పధ్నాల్గు సంవత్సరాల తరవాత తిరిగి వచ్చాను...నాపోకని గుర్తించనట్లే నా రాకనీ ఎవరూ గుర్తించలేదు. యీ లోపల ఎవరి హృదయాలలో ఏవి సంఘర్షణలు జరిగితే నాకేం?

ఆయనే కాబోలు, దగ్గుతున్నారు. లోపలికి పోవాలి మందిచ్చే టైమయింది ... తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది: యీ జీవితాలెంతటి మొండివి! చిరుకెరటాలతో కదలాడిపోయిన సరస్సే తృటితో ప్రశాంతంగా అవుతుంది. గాలికి భారంగా వంగి నేలకరచిన గడ్డిపోచ అవకాశం దొరికేసరికి నిటారుగా నిలుస్తుంది. మనుషులూ అంతే స్వర్గంలోంచి నరకంలోకి ప్రయాణించీ, దానినుండీ చెక్కుచెదరనట్లు బయటపడతారు...దానికి నిలచిన నిదర్శనలాంటిది నా జీవితం. గత దశాబ్దం నా జీవితంలో గడచినది—అంతా యిప్పుడో ప్రతిధ్వనిలాగా, ప్రతిధ్వనిస్తూన్న ప్రతిధ్వనిలాగా మాత్రమే నిలచి వుంది.ఎవరి జీవితంలోనైనా అంతే—గడచిన కాలం మిగిల్చిపోయేది ప్రతిధ్వనులే!

కావ్యజగత్తు

# ఊర్వశి

రాచకొండ శ్రీహరి

ఆహా! ఊర్వశి అనగానే భారతీయకవి ఎలాగ పరవశుడై పోతాడో! విక్రమోర్వశీయంలో కాళిదాసే పురూవసుడు. ఇందుమతీ రతీ శకుంతలా మాళవికా వాళ్ళవాళ్ళ ప్రియుల ప్రేయసులు; ఊర్వశి కాళిదాసు ప్రేయసి. ''అనంత యౌవనా!'' అని ఊర్వశిని ఆప్యాయంగా పిలిచి పిలిచి రవీంద్రుడు ఎంతపాట పాడాడు! అసలు సామాన్య గేయాలు పాడే కవి కంఠంలో కూడా ఉజ్వల ప్రతిభ పోస్తుంది ఊర్వశి; నందనానిలం కదిపేసే మందాకినిలాగా దాన్ని పాడించేస్తూంది ఊర్వశి! పాపం! రవివర్మ ఒక్కడే ఊర్వశిని వేస్తానని ఉత్తస్త్రీని గీశాడు.

ఊర్వశిని కవి ఒక్కడే ఎరుగును; అందరూ ఎరుగరు; అదైనా మామూలు మానవుడైనప్పుడు ఎరుగడు. లోకానికి ఊర్వశిలేదు; కవి వాక్కు ఋషివాక్కైతే లోకంలో ఊర్వశి ఒక్కత్తే ఉంటుంది కూడా!

లోకంలో రంభలు చాలామంది ఉన్నారు; ఒక్క ఊర్వశే ఉంది. అస్థిమాంసాదులతో రంభను చేసారు; యుగయుగాల ఆవేగంతో, ఆనందంతో, ఆశతో, ఆశయాలతో, వేదనతో, వివిధానుభవాలతో ఊర్వశిని చేశారు. లోకం రంభనుకోరుతుంది; కవి ఊర్వశిని ఆరాధిస్తాడు. లోకం ఊర్వశిని మృగతృష్ణ అంటుంది; కవి రంభను మదికోర్క అంటాడు. లోకం కవిని చూసి హేళన చేస్తుంది. కవి ఊర్వశిని లోకసంగ్రహార్థమే అవతరించిందంటాడు. ఒక చక్కని స్త్రీ యెలా ఉందో దాన్ని లోకం రంభ అంటుంది. స్త్రీ ఎలా ఉండాలో దాన్ని లోకము రంభ అంటుంది. స్త్రీ ఎలా ఉండాలో దాన్ని కవి ఊర్వశి అంటాడు. ఒక లావణ్యవతి రంభలాగ ఉంటుంది అని అంటే ఆమెగాని రంభగాని గర్వపడనక్కరలేదు; ఆమె ఊర్వశిలాగ ఉంటుంది అంటేమాత్రం కవి ఏడుస్తాడు, అసత్యం ఒప్పుకోలేదు కనుక.

ఊర్వశి పుట్టుగను గురించి రెండు గాథలున్నాయి. క్షీరసాగర గర్భంలోనుంచి అప్సరసలు అందరితో జన్మించింది అన్నది ఒకటి. రవీంద్రుడు ఇదే అంటాడు. ఒక చేతిలో విషభాండంతో ఒక